
నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
3 | బుధవారం 8 మే 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

నల్లగొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్‌దే

- ఇక్కడినుంచి నాలుగు సార్లూ మనమే గెలిచాం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తేనే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- కాంగ్రెస్ మాటలు నమ్మవద్దు : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- నల్లగొండలో అట్టహాసంగా రాకేశ్‌రెడ్డి నామినేషన్.. కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ

నల్లగొండ, మే 7: ఖమ్మం-వరంగల్-నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఆవిర్భవించిన నాటి నుంచి నాలుగు సార్లు ఎన్నికలు జరుగగా.. అన్ని సార్లూ బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలిచారని, ఈసారి కూడా గులాబీ జెండా ఎగుర వేసేందుకు పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం హనుమకొండ నుంచి కాన్వాయ్‌తో భారీ ర్యాలీగా బయల్దేరి వెళ్లి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి నల్లగొండలో నామినేషన్ వేశారు. అలాగే జిల్లాకేంద్రంలో హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మీ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చారు. అనంతరం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి రాకేశ్‌రెడ్డి ఏఆర్‌వో, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తేనే మండలిలో నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని, కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వృథా అవుతుందని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

**గ్రాడ్యుయేట్లు ఆలోచించి ఓటేయాలి : సత్యవతి**

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నో మాయమాటలు, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. మరోసారి నమ్మి ఆ పార్టీకి ఓట్లు వేయవద్దు. గ్రాడ్యుయేట్లు ఆలోచించి బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటేస్తే సమస్యలు పరిష్కరించడానికి రాకేశ్‌రెడ్డి పోరాటం చేస్తారు. కాంగ్రెస్ మోసాలు బయట పెట్టాలంటే ఎంపీలు, ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తేనే ఈ ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు.

**కేసీఆర్ రాకతో కొత్త ఉత్సాహం**

**– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే**

కేసీఆర్ బయటకు రాగానే కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వణుకు మొదలై ప్రజల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. గ్రాడ్యుయేట్లు రెండు సార్లు నన్ను ఎమ్మెల్సీగా గెలిపించారు. ఈసారి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిల్ తత్వం గ్రాడ్యుయేట్లకు తెలుసు. ఎక్కడా గెలువలేక కాంగ్రెస్ కండువా కప్పుకొని వచ్చే తీన్మార్ మల్లన్నను చిత్తుచిత్తుగా ఓడించాలి. కేసీఆర్ వేసిన నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చామనడం సిగ్గుచేటు. బీఆర్‌ఎస్ ఉద్యోగులకు మంచి పీఆర్‌సీ ఇచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదు.



బైక్ ర్యాలీలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా

నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో ప్రశ్నించే గొంతుక అయి నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా. ఈ నియోజకవర్గం నుంచి అన్ని సార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలిచారు. ఈ సారి నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే మండలిలో పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నిస్తా. బీఆర్‌ఎస్‌లో ఉన్న స్వేచ్ఛ బీజేపీలో ఉండదు. ఆ పార్టీలో నాకు కనీస గౌరవం ఇవ్వలేదు. ఇక్కడ కేసీఆర్ ఎంతో గౌరవంతో టికెట్ ఇచ్చి పోటీ చేయిస్తున్నారు. మార్పు పేరుతో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని ఆగమాగం చేసింది.

**– ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి**



నల్లగొండలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

# బీజేపీకి ఎందుకు ఓటేయాలి?

- చెప్పిన తర్వాతే మోదీ అడుగుపెట్టాలి
- అరూరి.. ఓ అనకొండ
- వరంగల్ భూములను కబ్జా చేశాడు
- హనుమకొండ చౌరస్తా కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 7 : వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్.. అనకొండ, ఇక్కడి భూములను కబ్జా చేశాడని సీఎం ఏ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హనుమకొండ చౌరస్తా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తులసి వనంలో గంజాయి మొక్కలా అరూరి రమేశ్ ఇక్కడ ఉన్నాడని, వరంగల్ ప్రాంతాన్ని పట్టి పీడిస్తున్నాడని విమర్శించారు. బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో ఆ పార్టీ నాయకులు చెప్పాలని, సమాధానం చెప్పిన తర్వాతే మోదీ ఇక్కడ అడుగుపెట్టాలన్నారు. కాజీపేటకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీ మోదీ లాహోర్‌కు తరలించాడని, గిరిజన యూనివర్సిటీని పదేళ్ల తర్వాత మొన్న ప్రారంభించారని తెలిపారు. రామప్ప ఆలయాన్ని యునెస్కో గుర్తిస్తే నిధులు ఇవ్వలేదని, వేయి స్తంభాల గుడికి ఇచ్చిన నిధులు ఎంతో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి మోదీ గాడిద గుడ్డు ఇచ్చారని విమర్శించారు. కాజీపేట రైల్వే జంక్షన్‌ను రద్దు చేసే పరిస్థితి బీజేపీ తీసుకొచ్చిందన్నారు. తెలంగాణ వర్సెస్ గుజరాత్ ఫైనల్‌లో మోడీ, అమిత్‌షా ఇటు పక్కన రాహుల్ గాంధీ ఉన్నాడని, మే 13న జరిగే మ్యాచ్‌లో గుజరాత్‌ను డక్ అవుట్ చేయాలని వరంగల్ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ అధికారులు వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎస్టిమేషన్ వేసి తీసుకురావాలని, మామునూరులో ఎయిర్‌పోర్టు కూడా రానుందని చెప్పారు. కడియం కావ్య కబ్జా చేసేది కాదు.. కష్టాలు తెలిసిన వ్యక్తి అని మంత్రి సీతక్క అన్నారు. అరూరి రమేశ్ దోచుకొని దాచుకునేందుకు నిలబడ్డాడని విమర్శించారు. బీజేపీ రాముడి పేరుతో ఓట్లు అడుగుతోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మతాలు, కులాలు, ప్రాంతీయ మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, సురేఖ, అభ్యర్థి కావ్య, ఎమ్మెల్యేలు



హనుమకొండ బస్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన వరద నీరు

# అకాల వర్షం ఆగమాగం

## ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం



వెంకటాపూర్(నూగూరు)లో తడిసిన ధాన్యం

- పలు గ్రామాల్లో నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- కట్ర్యాల శివారులో చెట్టు కూలి ఒకరి మృతి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దయిన ధాన్యం
- రహదారులపైకి చేరిన వరద
- హనుమకొండ బస్‌స్టేషన్ జలమయం
- ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం

నమస్తే నెట్‌వర్క్, మే 7: ఉమ్మడి వరంగల్ జిల్లాను మంగళవారం ఈదురుగాలులు ఆగమాగం చేశాయి. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు కూలగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గణపురం, మహదేవపూర్, పలిమెల మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు, ఏటూరునాగారం, మంగపేట, గోవిందరావుపేట, వెంకటాపూర్, వెంకటాపురం మండలాల్లో ధాన్యం రాశులు తడిసి రైతులు ఇబ్బందులు పడ్డారు. టార్పాలిన్ షీట్లు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. కమలాపూర్, ఐనవోలు, శాయంపేట, ధర్మసాగర్, దామెర, కాజీపేట మండలాల్లో చెట్లు విరిగాయి. ఖానాపురం, ఆత్మకూరు, చెన్నారావుపేట, వర్ధన్నపేట మండలాల్లో బలమైన ఈదురుగాలులకు పలువురి ఇంటిపై కప్పులు ఎగిరిపడ్డాయి. గ్రేటర్ వరంగల్‌లో సుమారు రెండు గంటల పాటు గాలి దుమారం బీభత్సం సృష్టించింది. దీంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో హనుమకొండ బస్‌స్టేషన్ జలమయం కాగా, పలు కాలనీల్లో వరద నీరు వచ్చి చేరింది. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిరిగిపోగా, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. జనగామ, బచ్చన్నపేట, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాల్లో వడగండ్ల వాన కురిసింది. మామిడి చెట్లకు కాయలు రాలిపోయాయి. కూరగాయలు, పండ్ల తోటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తొర్రూరులో మోస్తరు వర్షం కురిసింది.



మడికొండలో జలమయమైన ప్రధాన రహదారి



జనగామ: శామీర్‌పేటలో జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

### చెట్టు కూలి యువకుడి మృతి

వర్ధన్నపేట: వరంగల్ నుంచి వస్తున్న ట్రాక్టర్ డబ్బాలో ఇల్లంద గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఆబర్ల దయాకర్(22) ఎక్కగా, కట్ర్యాల శివారులోని రహదారి పక్కన ఎండిపోయి ఉన్న భారీ చెట్టు ఒక్కసారిగా ట్రాక్టర్‌పై కూలిపోయింది. దీంతో దయాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. రోడ్డుపై చెట్టు కూలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



దయాకర్ (ఫైల్)



హనుమకొండలో..



బుధరావుపేటలో గాలి దుమారానికి లేచిపడిన ఇంటి రేకులు



ఐనవోలు: కొండపర్తి కొనుగోలు కేంద్రంలో తడిచిన వరి ధాన్యం



చిన్నపెండ్యాలలో కూలిన కరెంటు స్తంభం




బీఆర్‌ఎస్ కార్యాలయానికి వచ్చి మద్దతు తెలుపుతున్న ప్రజలతో వినయ్ భాస్కర్, అభ్యర్థి సుధీర్‌కుమార్

# ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలి

- కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, మే 7: బీఆర్‌ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి వర్ధన్నపేటలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు, ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందడంతో సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు, సమావేశంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి పాల్గొన్నారు.



వర్ధన్నపేట: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, చిత్రంలో అభ్యర్థి సుధీర్‌కుమార్

### మా మద్దతు బీఆర్‌ఎస్‌కే

హనుమకొండ, మే 7: బీఆర్‌ఎస్ పార్టీకి రోజురోజుకూ మద్దతు పెరుగుతున్నది. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయానికి నియోజకవర్గంలోని గ్రామాలు, తండాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ పార్లమెట్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను కలిసి గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా ప్రచారం చేస్తామని కొందరు, కొన్నివర్గాల వారు మద్దతు పత్రాలు అందజేస్తున్నారు.

# విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

**ఎన్‌పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి**

హనుమకొండ సబర్బన్, మే 7: రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజినీర్లకు మంగళవారం సూచనలు జారీచేశారు. విద్యుత్ ఉద్యోగులు హెడ్‌క్వార్టర్‌లో అందుబాటులో ఉంటూ 24గంటలు సేవలు అందించాలన్నారు. గోదావరి తీర ప్రాంతాలైన ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్‌లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను తరలించేందుకు వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎస్పీఎం షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పెంచాలన్నారు. కార్పొరేట్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 18994250028 లేదా 1912కు ఫోన్ చేయాలని తెలిపారు.

# బీజేపీ ఫ్లెక్సీ చింపిన కాంగ్రెస్ నాయకుడు

పరకాల, మే 7: బీజేపీ ప్రచార రథానికి ఉన్న ఫ్లెక్సీని చింపేసిన ఘటన నడికూడ మండలం వరికోల్‌లో మంగళవారం జరిగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేసే వాహనం గ్రామానికి రాగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కానాల మధుకర్ అడ్డుకున్నాడు. గ్రామంలో తమ పార్టీ మాత్రమే ప్రచారం చేయాలని, ఇతర పార్టీలు ప్రచారం చేయొద్దంటూ దానికున్న ఫ్లెక్సీని చింపేశాడు. దీంతో గ్రామానికి చెందిన కొందరు అతడిని అక్కడి నుంచి లాక్కెళ్లారు. ఈ ఘటనపై బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఫ్లెక్సీని చింపేస్తున్న కాంగ్రెస్ నాయకుడు మధుకర్